జోన్-5లో సమస్యల తిష్ట

- అరకొర సిబ్బందితో పారిశుధ్య పనులు
- చిన్నపాటి వర్షాలకే రహదారులు, డ్రైనేజీలు అధ్వానం
- కార్మికులను పెంచాలని విజ్ఞప్తి



56వ వార్డులో డ్రైనేజీలు, రహదారి దుస్థితి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5లో పారిశుధ్య సమస్యలు తిష్ట వేశాయి. పారిశుధ్య కార్మికుల కొరతే ఇందుకు కారణం. జోన్ పరిధిలోని ఉత్తర, పశ్చిమ, దక్షిణ నియోజకవర్గాల్లో 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. వీటిలో పారిశుధ్య కార్మికుల కొరత ఎక్కువగా ఉండటంతో శానిటేషన్ పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్, కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీ, ఎన్ఏడీ కొత్తరోడ్డు, మల్కాపురం, శ్రీహరిపురం, సింధియా తదితర ప్రాంతాల్లో జన సంచారం, వ్యాపారాలు అధికంగా ఉంటాయి. ఈ ప్రాంతాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఎక్కువగా ఉంది. జీవీఎంసీ పరిధిలో వార్డుల విస్తీర్ణం పెరిగినా.. పారిశుధ్య కార్మికుల సంఖ్య పెరగలేదు. దీంతో ఉన్న కార్మికులనే పారిశుధ్య పనులకు సర్దుబాటు చేస్తున్నారు. పర్మినెంట్ సిబ్బంది, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. వీరి పర్యవేక్షణకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లేని వార్డుల్లో మేస్త్రీలు, సచివాలయ శానిటరీ సెక్రటరీలను పబ్లిక్ హెల్త్ అధికారులు వినియోగిస్తున్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బంది..

జోన్ పరిధిలోని 24 వార్డులకు 24 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహించాల్సి ఉండగా.. పూర్తిస్థాయిలో లేరు. ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 9 మంది ఔట్ సోర్సింగ్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, ఒక పబ్లిక్ హెల్త్ వర్కర్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు 106 మంది ఆయా వార్డుల్లో విధులు నిర్వహిస్తున్నారు. వార్డుల్లో కార్మికులు సరిపోక పోవడంతో రిటైర్డ్ సిబ్బందితో ఆఫ్‌టింగ్‌లుగా తీసుకుంటున్నారు. పారిశుధ్య సిబ్బంది సెలవు పెడితే గల్లీలు దుర్గంధంగా మారుతున్నాయి. అవగాహన లేని మలేరియా, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించడంతో కొన్ని వార్డుల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.



బిర్లా జంక్షన్‌లో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో సునీల్‌కుమార్

ఇదీ పరిస్థితి..

- జోన్-5 పరిధిలో సరిపడా పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి.
- కాలువలు, గెడ్డలు, కల్వర్టులు పూడికలతో నిండిపోవడంతో చెత్తాచెదారం తొలగించడానికి సిబ్బంది కొరత కారణంగా చూపిస్తున్నారు.
- తడి-పొడి చెత్త సేకరణ, క్లాప్ వాహనాలు, గల్లీలో రోడ్లు, కాలువలు శుభ్రపరచడానికి ఉన్న సిబ్బందితో కాలం గడిపేస్తున్నారు.
- చిన్నపాటి వర్షాలకే రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా మారుతున్నాయి.
- ప్రస్తుత వర్షా కాలంలో పరిస్థితులు మరింత దారుణంగా తయారయ్యే అవకాశముంది.
- శాశ్వత వర్కర్లు 166 మంది, సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు 106 మంది, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది 1,023 మందితో నెట్టుకొస్తున్న జోన్-5 పబ్లిక్ హెల్త్ అధికారుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, పారిశుధ్య కార్మికులను పెంచాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



జీవీఎంసీ జోన్-5 పరిధిలో పారిశుధ్య కార్మికుల కొరత వాస్తవంగా ఉన్నా.. వార్డుల వారీగా సిబ్బందిని సర్దుబాటు చేశాం. పారిశుధ్యానికి ప్రాధాన్యమిస్తూ, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో కార్మికులను భాగస్వాములను చేశాం. వార్డుల్లో సిబ్బందిని నియమించేందుకు జాబితాను తయారు చేశాం. సిబ్బంది కొరత ఉన్న స్థానంలో కొత్త వారిని నియమించేందుకు జీవీఎంసీ మేయర్, కమిషనర్, జోనల్ కమిషనర్ల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లాం.

– డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏఎంహెచ్‌వో, జోన్-5

జీవీఎంసీ జోన్-5లో పారిశుధ్య సిబ్బంది వివరాలు

వార్డు	శాశ్వత కార్మికులు	ఔట్ సోర్సింగ్	నైట్ కార్మికులు	సూపర్ వైజర్లు	డిప్యుటేషన్	వార్డు	శాశ్వత కార్మికులు	ఔట్ సోర్సింగ్	నైట్ కార్మికులు	సూపర్ వైజర్లు	డిప్యుటేషన్
40	02	09	09	00	01	52	06	35	41	04	00
41	17	18	35	04	01	53	06	31	37	02	00
42	15	31	46	03	01	54	09	34	41	04	02
43	12	25	37	03	01	55	12	26	38	04	01
44	06	45	51	04	00	56	08	35	43	04	01
45	02	40	41	02	06	57	11	31	42	02	01
46	05	23	28	00	00	58	11	31	42	03	05
47	06	27	31	03	00	59	04	34	38	03	02
48	06	34	40	03	02	60	06	39	44	04	00
49	05	45	50	02	03	61	08	27	34	02	03
50	01	33	33	03	01	62	04	28	31	01	01
51	01	47	47	04	01	63	03	21	23	02	00

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

మల్కాపురం సీఐ విద్యాసాగర్



మల్కాపురం: మల్కాపురం సీఐగా విద్యాసాగర్ బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన సనావుల్లా బదిలీ కావడంతో, ఆయన స్థానంలో విద్యాసాగర్ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కల్పిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి ఘటనలు జరగకుండా, తమ సిబ్బంది సాయంతో సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే రౌడీ షీటర్లు, ఆకతాయిలకు హెచ్చరికలు జారీ చేశామన్నారు. తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలు సేవించినా లేదా విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నా తమకు తెలియజేస్తే, తక్షణం స్పందిస్తామన్నారు. రోడ్లపై యువత గుంపులు, గుంపులుగా ఉండరాదని హెచ్చరించారు. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించినా, లేదా వేధింపులకు గురి చేసినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మల్కా పురం స్టేషన్ పరిధి ముఖ్య కూడళ్లలో నిత్యం గస్తీ నిర్వహణ, వాహనాల తనిఖీల కార్యక్రమాలు చేపడతామని, అనుమానితులను వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు. ఏ సమస్య ఉన్నా ఫిర్యాదుదారులు నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వామికి సహస్రనామార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం జరిపారు. అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్టింపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

క్లుప్తంగా

నేడు రేషన్ డీలర్ల సమావేశం

గోపాలపట్నం: సింహాచలం గోశాల జంక్షన్ వద్ద ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం విశాఖపట్నం జిల్లా జాతీయ ప్రజా పంపిణీ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు రేషన్ డీలర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చెవ్వేటి జీవన్ కుమార్ తెలిపారు. గోపాలపట్నంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్స్ సమస్యలు, ఇబ్బందులపై చర్చించనున్నామన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు ఈ వేదిక ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గంట్యాడ అప్పలరాజు, నాగేశ్వరరావు, ఉరుకూటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'మీల్స్ అగ్రిమెంట్‌ను వ్యతిరేకిస్తున్నాం'

మల్కాపురం: కార్మికులకు సంబంధించిన మీల్స్ అలవెన్స్‌కు సంబంధించి ఐఎన్‌టీయూసీ ఇటీవల షిప్‌యార్డ్ యాజమాన్యంతో చేసి అగ్రిమెంట్‌ను తాము వ్యతిరేకిస్తున్నామని షిప్‌యార్డ్ సీఐటీయూ యూనియన్ ప్రతినిధులు బి.ఎస్.ఎన్.రాజు, ఎస్.ప్రసాద్ అన్నారు.ఈ అంశంపై మల్కాపురం సీఐటీయూ కార్యాలయంలో వద్ద సోమవారం వారు మాట్లాడుతూ మీల్స్ అలవెన్స్‌పై ఇటీవల యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్ ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. షిప్‌యార్డ్ స్టాఫ్, కార్మికులకు నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. 2014లో సీఐటీయూ మీల్స్ అలవెన్స్ పెంపుదల చేసి, ఎరియర్స్ ఇప్పించిన సంగతిని వారు గుర్తు చేశారు. ఇప్పుడు ఐఎన్‌టీయూసీ (గుర్తింపు యూనియన్) చేసిన అగ్రిమెంట్‌లో మీల్స్ అలవెన్స్ పెంచినా ఎరియర్స్ లేకుండా చేశారని ఆరోపించారు. దీని వల్ల కార్మికులు నష్టపోతారన్నారు.

నిరాశ్రయులకు భోజనం



నిరాశ్రయులకు భోజన పొట్లాలు పంపిణీ చేస్తున్న కనకమేఘనంద్

సింధియా: ఇండస్ట్రియల్ ఏరియా శ్రమశక్తి కార్మిక సంఘ అధ్యక్షుడు పెదిరెడ్ల నానాజీ కుమారుడు కనక మేఘనంద్ సోమవారం సింధియా నుండి గాజువాక వరకు ప్రధాన రహదారి పక్కన ఉంటున్న నిరాశ్రయులకు భోజన పొట్లాలు పంపిణీ చేశారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పలకలు, పుస్తకాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న సుమారు 150 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

శివుని ప్రతిరూపమే శంకరాచార్యులు



ప్రవచిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: శంకరాచార్యులు సాక్షాత్ శివుడి అవతారమని కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితానగర్ శ్రీ లలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం జగద్గురు శంకర విజయంపై స్వామివారు చేసిన ప్రవచనం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. శంకరుల అవతరణ నాటికి భారతావనిలో ధార్మిక వాతావరణాన్ని, సన్యాసాశ్రమ వైశిష్ట్యాన్ని, జప తప హోమాల గురించి తెలియజేశారు. శంకరులు అద్వైత సిద్ధాంతం ప్రచారం ద్వారా దేశంలో జాతీయ సమైక్యతకు దోహదం చేశారని చెప్పారు. శంకరాచార్యులు మహాకవి అని, అపారమైన స్తోత్ర వాఙ్మయం భక్తి సాహిత్యం సృష్టించారని వారి కవిత్వం, బోధనల ప్రభావం నేటికీ సమాజంపై ఉందని అభిభాషించారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, అశేష భక్తజనం స్వామి వారి భాషణాన్ని ఆలకించి పులకించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్మిక మంత్రి దృష్టికి సమస్యలు



మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మల్కాపురం: రాష్ట్ర కార్మిక- ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రి వి.సుభాష్‌ను సోమవారం ఏపీ ఐఎంఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. గాంధీగ్రామ్ ఈఎస్ఐ ఆసుపత్రిలో అవసరమైన వైద్య సిబ్బంది, వైద్యులను నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మిక బీమా ఆస్పత్రుల్లో అవసరమైన వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.మంత్రిని కలిసిన వారిలో ఏపీ ఐఎంఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సూర్యనారాయణ,ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రేమచంద్, కార్యదర్శి సురేష్, కోశాధికారి గిరిధర్ తదితరులు ఉన్నారు.

కాలుష్య రహిత ప్రాంతంగా ఆటోనగర్



ఆటోనగర్ ఎఫ్-బ్లాక్‌లో మొక్కలు నాటుతున్న పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్ఎంఈ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌ను కాలుష్యరహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ఏడీ చంద్రమౌళి కోరారు. ఆటోనగర్ ఎఫ్- బ్లాక్‌లో ఎంఎస్ఎంఈ, విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సంయుక్తంగా సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని పారిశ్రామిక ప్రాంతమైన ఆటోనగర్‌లో ప్రతీ పారిశ్రామిక వేత్త ఆచరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ అధికారులు, సిబ్బంది, వాసీవా, ఐలా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, ఐలా సిబ్బంది స్వచ్ఛత పక్వాడా ప్రతిజ్ఞ చేశారు. ఎఫ్-బ్లాక్‌లో ర్యాలీ నిర్వహించారు. ఆటోనగర్ వాసీవా అధ్యక్షుడు ఎస్.పాండు రంగప్రసాద్, ఐలా మాజీ చైర్మన్లు వై.సాంబశివరావు, శేషగిరిరావు, ఏడీ ఎఫ్-బ్లాక్‌లో పలు పరిశ్రమల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఎస్ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ బి.ప్రభాకర్ కుమార్, ఏడీలు శ్రీను, మూర్తి, రెడ్డి, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా కోశాధికారి పర్చూరి ప్రభాకర్, కేవీఎన్ రాజు, రెడ్డి, కృష్ణ ప్రసాద్, ప్రశాంత్, నూకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

'నిలిపివేసిన పనులు వెంటనే ప్రారంభించాలి'



ధర్నాలో ప్రసంగిస్తున్న యూనియన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని కొన్ని విభాగాల్లో నిలిపివేసిన పనులను వెంటనే ప్రారంభించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ భవనం వద్ద సోమవారం ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ సీఎంఎస్‌లో గత 7 నెలలుగా టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు నిలిచి పోయాయన్నారు. అదే విధంగా బీఎఫ్, ఆర్ఎంహెచ్‌పీ, సీఈడీ విభాగాల్లో గత రెండు నెలలుగా పనులు నిలిచిపోయాయన్నారు. దీని వల్ల సుమారు 100 మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఈ పరిస్థితికి కారణం యాజమాన్యం నిర్లక్ష్యమేనని ఆరోపించారు. పనులు ప్రారంభించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓ.వి.రావు, నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, వి.వి.రమణ, నారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు, కార్మికులు

మహారాణిపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. జీవో 549 ప్రకారం కార్మికులకు రూ.16 వేల జీతం అమలు చేయాలని, వివిధ కటింగ్‌లు చూపిస్తూ రూ.11,200 మాత్రమే చెల్లిస్తున్నారని యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకటరావు అన్నారు. త్వరలో ఈ కాంట్రాక్టు ముగుస్తుందని, కాంట్రాక్టు ముగిసే సమయానికి బకాయిలు లేకుండా జీతాలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర బకాయిలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో పీఎఫ్ కట్టలేదని అడిగినందుకు ఆర్.ఆదిలక్ష్మిని సంబంధిత కాంట్రాక్టర్ అన్యాయంగా తొలగించారని, దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.కనకరాజు, డి.రాజేశ్వరి, డి.భాగ్య, కేశవరావు, పోతురాజు, పి.రాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బోసిపోయిన దువ్వాడ రైల్వేస్టేషన్

అగనంపూడి: విశాఖ నుంచి విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల మధ్య నడుస్తున్న జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు రాక దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు సోమవారం బోసిబోయాయి. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల్లో అధిక శాతం మంది ఈ మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్ల మీదే ఆధారపడి ఉన్నారు. ఈ మార్గంలో ప్రయాణం చేసే 24 జతల రైళ్ల ద్వారా ఎంత మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారో ఈ మూడు రైళ్ల ద్వారా అంతమంది ప్రయాణం చేస్తారు. అలాంటి కీలకమైన రైళ్లన్నీ రద్దు చేయడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు వెదుక్కుంటున్నారు. మూడు రైళ్లు రద్దు కావడంతో పాసింజర్లు కూడా ఇబ్బంది పడ్డారు.

వినతుల పరిష్కారానికి చర్యలు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆరు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి, ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 03, రెవెన్యూ విభాగానికి 03 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. వినతుల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సాయంత్రం సచివాలయ సిబ్బంది, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జెడ్సీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వో బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, టీపీవో విజయకుమార్, డీఈ భరణికుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

లక్షల వ్యయం.. నెరవేరని లక్ష్యం!

- అలంకారప్రాయంగా హాకర్స్ జోన్
- ఆక్రమణకు గురవుతున్న వైనం



షాపుల్లో నిద్రపోతున్న నిరాశ్రయులు



లక్షల వ్యయంతో నిర్మించిన హాకర్స్ జోన్



షాపులో ప్లాస్టిక్ పెట్టెలు పెట్టి ఆక్రమించిన వైనం

మల్కాపురం: లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హాకర్స్ జోన్ లక్ష్యానికి దూరంగా ఉంది. లక్షల వ్యయం బూడిదపాలు అన్నట్టు మారింది. అధికారులు సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో హాకర్స్ జోన్‌లో ఏర్పాటు చేసిన సుమారు 35 షాపులు వృథాగా ఉన్నాయి.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక సుమారు 35 షాపులను 2014 లో అప్పటి జీవీఎంసీ అధికారులు సుమారు రూ. 17 లక్షల వ్యయంతో నిర్మించారు. మల్కాపురం నుంచి కోరమాండల్ వరకు సర్వీసు రోడ్లు, ఫుట్ పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. శ్రీహరిపురం,కోరమాండల్,మల్కాపురం ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని పోలీసులు జీవీఎంసీ ఉన్నతాధికారులకు వివరించారు. దీనిపై స్పందించిన నాటి అధికారులు మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక గల స్థలంలో హాకర్స్ జోన్ ఏర్పాటు చేశారు.అయితే ఈ షాపుల్లోకి ఫుట్‌పాత్,తోపుడుబళ్ల వ్యాపారులు వచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ఈ జోన్ రోడ్లపై వచ్చే వారికి దూరంగా ఉండడంతో తమ వ్యాపారాలు అంతగా సాగవని చెబుతున్నారు. దీంతో 2014 నుంచి ఇక్కడ ఏర్పాటు చేసిన షాపులు ఖాళీగా ఉన్నాయి.

ఆకతాయిలకు అడ్డా

ఇదే అదునుగా భావించిన కొంత మంది ఆకతాయిలు రాత్రి సమయంలో ఇక్కడ మద్యం,గంజాయి వంటివి సేవించడానికి అడ్డాగా మార్చుకున్నారు. మరి కొంత మంది వ్యాపారాలు జీవీఎంసీ అధికారుల వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా షాపులను ఆక్రమించి చికెన్ సెంటర్,టిఫెన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. కొంత మంది భిక్షాటన చేసుకున్న వారు ఈ షాపులను నివాసాలుగా మార్చుకున్నారు. షాపులు నిర్మించిన లక్ష్యానికి చెడ పట్టిందని ఫలితంగా ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన షాపులను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

విశాఖ ఉక్కుకు ఊపిరివ్వండి

స్టీల్ హెచ్ఎంఎస్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు తీవ్రమైన సంక్షోభంలో ఉందని, కేంద్ర ప్రభుత్వం కావాలనే ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తోందని స్టీల్ హెచ్ఎంఎస్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో నూతన వేతనాలు అమలు చేయడం లేదని, అదీగాక ప్రతి నెలా సమయానికి వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చత్తీస్‌ఘడ్‌లో సోమవారం నిర్వహించిన స్టీల్ మెటల్ అండ్ ఇంజినీరింగ్ ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ పరిస్థితిపై మెటల్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్పందించి ఉక్కు మంత్రికి పరిస్థితిని విన్నవించాలని, ఉక్కుకు ఊపిరివ్వాలని కోరారు. అలాగే స్టీల్‌ప్లాంట్ సీఎండీకి కూడా ఒక లెటర్ రాయాలన్నారు. సెయిల్ మాదిరిగానే విశాఖ ఉక్కులో కూడా అన్ని బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. స్పందించిన మెటల్ ఫెడరేషన్ ప్రతినిధులు ఈ విషయాన్ని ఉక్కు మంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అవసరమైతే విశాఖ ఉక్కు సీఎండీని కలిసి మాట్లాడతామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎస్‌జేసీఎస్ సభ్యులు రాజేంద్ర ప్రసాద్ సింగ్, సచ్చేంద్ర నాయక్, స్టీల్ మెటల్ అండ్ ఇంజినీర్ ఫెడరేషన్ అధ్యక్షుడు త్యాగి, కార్యదర్శి సంజోట్ వాడేకర్, హెచ్ఎస్ మిత్ర, లాల్, సుకాంత్ పాల్గొన్నారు.